క్లుప్తంగా

కొబ్బరిచెట్టు పడి విద్యుత్ స్తంభాల ధ్వంసం

అంబాజీపేట: ఆకస్మికంగా శనివారం తెల్లవారుజామున వీచిన ఈదురుగాలులకు కముజువారి లంక ప్రధాన రహదారిలో కొబ్బరిచెట్టు పడి రెండు విద్యుత్ స్తంభాలు, వైర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో విద్యుత్ వైర్లు తెగి పడే సమయం వేకువజామున కావడంతో పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈదురుగాలులకు విరిగిన చెట్లు

కొత్తపేట: అమలాపురం-రావులపాలెం రోడ్డులోని మందపల్లి వద్ద విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శనివారం సాయంకాలం వీచిన ఈదురుగాలులు, కురిసిన బారీ వర్షాల వల్ల మూడు చోట్ల చెట్లు విరిగిపడి పోయాయి. దీంతో ఇరువైపులా వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ఐదు కిలోమీటర్ల మేర పెంకులపాటి గరువు వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. రాత్రి ఎనిమిది గంటలకు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో వేసవి తాపానికి చలివేంద్రాలు ఏంతో ఉపయోగపడతాయని అందుకు దాతలు, యువకులు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేయాలని సర్పంచ్ జల్లి బాలరాజు అన్నారు. పుల్లేటికుర్రులో బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి బెహరా వీర హనుమంతరావు-వెంకట సత్య సూర్యకుమారి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక యూనియన్ బ్యాంక్ ఎదురుగా బస్ షెల్టర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది గోళ్ల రత్తాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వలంటీర్లకు అవార్డుల పంపిణీ

అంబాజీపేట: మండలంలోని 16 గ్రామాల వలంటీర్లకు ఈ నెల 22 నుంచి వచ్చే నెల 18 వరకు అవార్డులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఐ.రత్నంరాజు తెలిపారు. ఆయా గ్రామా పంచాయతీల్లో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టిబాబు హాజరవుతారన్నారు.

దాతల సహకారం అభినందనీయం

అంబాజీపేట: గ్రామాభివృద్ధితో పాటు ప్రజలకు సేవ చేసే దాతల సహకారం అభినందనీయమని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబులు అన్నారు. వక్కలంక గ్రామానికి చెందిన పప్పు వెంకట శివ సుబ్రహ్మణ్య శర్మ (సుబ్బు) గ్రామ పంచాయతీకి బహూకరించిన మినరల్ వాటర్ కూలర్‌ను సర్పంచ్ రేవతి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి శ్రీనివాస్, గుత్తుల రమణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, యల్లమిల్లి జయబాబు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మామిడికుదురు: పాశర్లపూడిలంకకు చెందిన ఇంటర్ విద్యార్థినిని వేధిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా శనివారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తన కుమార్తెను తాపీమేస్త్రి కాండ్రేగుల శివప్రసాద్ వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై విద్యార్థినిని నిందితుడు బ్లాక్ మెయిల్ చేస్తూ వేధిస్తున్నాడన్న ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామన్నారు.

చెట్టును ఢీకొట్టిన లారీ

పి.గన్నవరం: రాజవరం-పొదలాడ రోడ్డులో పెదకందాలపాలెం వద్ద శనివారం ఇసుక లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకందాలపాలెం ర్యాంపు నుంచి లోడుతో జగ్గన్నపేట వైపు వెళ్తున్న లారీ చర్చి వద్ద సైడు రోడ్డులో నుంచి వస్తున్న మోటారు సైక్లిస్టును తప్పించబోయి అదుపు తప్పింది. దీంతో పంట కాలువపై పెపు మార్జిన్‌లో ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఆ సమయంలో ఎదురుగా ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అయినవిల్లి: ఓ యువతిని వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన తరెట్ల శ్రీనివాస్ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనిపై ఆ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

విలసలో 1962 సేవలు

అయినవిల్లి: మండలంలోని విలసలో 1962 వెటర్నరీ అంబులెన్స్ సేవల ద్వారా ఓ చూడి గేదెను శనివారం ప్రాణాలతో రక్షించారు. విలస గ్రామానికి చెందిన పాడి రైతు సత్యనారాయణ గేదె ఈనడానికి సిద్ధంగా ఉంది. ఈ సమయంలో గర్భసంచిలోని సగభాగం బయటకు వచ్చింది. దీంతో రైతు 1962 ద్వారా వెటర్నరీ అంబులెన్స్ కోసం ఆశ్రయించారు. వెటర్నరీ వైద్యురాలు వి.శ్రీహర్షిణి తన సిబ్బందితో వచ్చి గేదెకు చికిత్స అందించి ప్రాణాలను కాపాడారు. ప్రభుత్వం పశువులకు వైద్యం అందించడం అంబులెన్స్ సేవలు ఏర్పాటు చేయడం సిబ్బంది సకాలంలో స్పందించడం పై అభినందనలు తెలిపారు.

వలంటీర్లకు మూడో ఏడాది వందనం

- సేవా పురస్కారాలు ప్రదానం
- 4,378 మందికి పురస్కారాలు

మామిడికుదురు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. పల్లెటూర్లు దేశానికి పట్టుగొమ్మలు అన్న జాతిపిత గాంధీ మాటలను వలంటీర్ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. రాష్ట్ర ప్రభుత్వం అతి ముఖ్యమైన కార్యక్రమాల్లో వలంటీర్ వ్యవస్థ అగ్రభాగంలో నిలుస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పారదర్శకంగా, సకాలంలో ప్రజలకు చేరువ చేరువ చేయడం వలంటీర్ వ్యవస్థ ముఖ్యోద్దేశం. వలంటీర్లకు ప్రతి నెలా గౌరవ వేతనం అందిస్తున్న ప్రభుత్వం వారి సేవలకు గుర్తింపుగా మూడేళ్ల నుంచి ఏటా అవార్డులందిస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో వారిని సత్కరిస్తోంది. వరుసగా మూడో ఏడాది కూడా అవార్డులందిస్తూ వారికి సముచిత స్థానం కల్పించడం పట్ల వలంటీర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అప్పనపల్లిలో వలంటీర్ల సన్మానంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

నగదు పురస్కారం ఇలా...

2019 ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు ఏటా సేవా వజ్ర పేరిట రూ.30 వేలు, సేవారత్న రూ.20 వేలు, సేవా మిత్ర రూ.10 వేల నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, మెడల్, బ్యాడ్జి అందించి వారిని శాలువాలతో సత్కరిస్తున్నారు. కేవలం గౌరవ వేతనం ద్వారా ఎన్నో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం ఈ విధంగా సముచిత స్థానం కల్పించడంపై ప్రతి ఒక్కరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో 4,478 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో 15 మందికి సేవావజ్ర, 56 మందికి సేవారత్న పురస్కారాలకు ఎంపికయ్యారు. 4,307 సేవామిత్ర అవార్డులు అందించనున్నారు. వీరికి గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేల చేతుల మీదుగా వలంటీర్లను సన్మానించి, పురస్కారాలు అందజేస్తున్నారు.

బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నాం



ప్రభుత్వం మాపై ఎంతో నమ్మకంతో మమ్మల్ని వలంటీర్లుగా నియమించింది. మా బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నాం. మా సేవల్ని మెచ్చి మమ్మల్ని సేవా పురస్కారాలతో సత్కరించడం చాలా ఆనందంగా ఉంది. రెట్టించిన ఉత్సాహంతో మేము పని చేసేందుకు ఈ పురస్కారాలు దోహదపడుతున్నాయి. ఏ ఒక్క లబ్ధిదారుడికి అన్యాయం జరగకుండా జాగ్రత్త పడుతున్నాం.

– కందికట్ల మురళి, సేవా వజ్ర, పాశర్లపూడి

పేదలకు సేవ చేయడం తృప్తిగా ఉంది



వలంటీర్‌గా ఎంతో మంది పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. లబ్ధిదారులకు ఈ పథకాలు మా చేతుల మీదుగా అందించడం చాలా సంతోషంగా ఉంది. పథకాలు పొంది సంక్షేమ పథకాలు పొందిన పేదల ముఖాల్లో చిరునవ్వు మాకు ఎంతో తృప్తినిస్తోంది. ప్రజలకు సేవ చేస్తున్న మాకు ప్రభుత్వం పురస్కారాలు అందించి సన్మానించడం మహద్భాగ్యంగా భావిస్తున్నాం.

– నేరేడుమిల్లి మురారి, సేవారత్న, అప్పనపల్లి

సేవలకు తగిన గుర్తింపు



వలంటీర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నాం. సేవలకు తగిన గుర్తింపుగా సేవావజ్ర అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వం మాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ప్రజల మన్ననలు అందుకుంటున్నాం.

– గుమ్మడి సుమ, సేవావజ్ర గ్రహీత, మొగలికుదురు

సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు ఓ విప్లవం

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా పారదర్శక పాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు ఓ విప్లవాత్మకమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మూడో ఏడాది గ్రామ వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలు ప్రదానం కార్యక్రమాన్ని తొలుతగా నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకరి శుభకరి కల్యాణ మండపంలో నిర్వహించిన సభకు ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మానస పుత్రికలుగా సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు ఆవిర్భవించాయన్నారు. అవినీతి రహితంగా, పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలన్నా, తద్వారా ఆదర్శ పాలన అందించాలన్నా యువత వల్లే సాధ్యమని సీఎం జగన్ గుర్తించి, ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వారధిగా ఈ వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. నియోజకవర్గంలో ఐదుగురికి సేవా వజ్ర, 21 మందికి సేవా రత్న, 1646 మందికి సేవా మిత్రలతో మొత్తం 1672 మందికి రూ.కోటి 70 లక్షల 30 వేలు నగదు పురస్కారం కింద అందజేస్తున్నారని తెలిపారు.

వలంటీర్లకు అవార్డుల ప్రదానం

కొత్తపేట పంచాయతీ పరిధిలోని 5 సచివాలయాల గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆయా అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ముందుగా జగ్గిరెడ్డిని వలంటీర్లు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు చాటుకున్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, పార్టీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు చావలి సుబ్బరాయశాస్త్రి, విళ్ల వీర్రాజు, షేక్ బడేమియా, మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, అధికారులు పాల్గొన్నారు.


కొత్తపేటలో గ్రామ వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తదితరులు

సంక్షేమాన్ని చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు

కొత్తపేట: సీఎం జగన్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. సీఎం జగన్ నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై శనివారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో జగ్గిరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అమరావతి భూములను చంద్రబాబు వర్గీయులు రియల్ ఎస్టేట్‌గా మలుచుకున్నారని, నేడు ఆ భూములను 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించడంపై ఆ స్థలాలను, ఆ స్థల లబ్ధిదారులైన పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరుస్తూ 'మీకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చి, సమాధి కట్టడానికి సరిపోతుందంటూ' చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవమని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు సంస్కారం ఇదేనా? అని మండిపడ్డారు. మీ హయాంలో ఎంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు నియోజకవర్గంలో ఆ పార్టీ నేత బండారు అభివృద్ధి నిరోధకుడిగా మారారని విమర్శించారు. నియోజకవర్గంలో, మీ ఇంటికి దగ్గరలో పొక్లెయిన్‌లు పెట్టుకుని అక్రమ మట్టి తవ్వకాలతో లంక భూములు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. మీ స్థలాల్లో అక్రమ ఇసుక నిల్వలు పెట్టుకున్న విషయాన్ని, విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులను అమ్ముకున్న అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ నిధులతో కల్యాణ మండపం నిర్మించి సామాన్యులకు అందుబాటులో లేని విధంగా పెద్ద మొత్తంలో వసూలు చేసుకుంటున్నారని విమర్శించారు. కనీసం కాపు సామాజిక వర్గానికి కూడా తగ్గించడం లేదన్నారు. బయటకు రాకుండా ఇంటి దగ్గర బ్యానర్లు కట్టుకుని అవినీతి గురించి మాట్లాడటం తగదన్నారు. కరోనా కాలంలో ఎవరు ఎలా పనిచేశారో తాను సిద్ధమని అన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, యువజన విభాగం కన్వీ నర్ గొల్లపల్లి స్వరూప్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.


నగరంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు


కొత్తపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ ర్యాలీ

మామిడికుదురు: బడుగు, బలహీన వర్గాలను కించపర్చే విధంగా చంద్రబాబు మాట్లాడిన తీరు నిరసిస్తూ శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయం నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వరకు అక్కడి నుంచి తిరిగి సచివాలయం 216వ నంబర్ జాతీయ రహదారిపై ఈ నిరసన ర్యాలీ జరిగింది. చంద్రబాబుకు అహంకార పూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇప్పటికైనా అతను తన వైఖరిని మార్చుకోని పక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ర్యాలీలో పార్టీ నేతలు కొమ్ముల రాము, పిచ్చుక చిన్న, నెల్లి దుర్గాప్రసాద్, జక్కంపూడి వాసు, బొంతు సీలిమ, యూవీవీ సత్యనారాయణ, చిక్కం బుజ్జిబాబు, ఏటీ హుస్సేన్, గూటం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ..

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీ రహితంగా అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట పంచాయతీ పరిధిలోని రామారావుపేట, శీలంవారిపాలెం, బొరుసువారిసావరం గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి వీధినా జగ్గిరెడ్డికి స్థానికులు, పథకాలు పొందిన లబ్ధిదారులు సాదరంగా స్వాగతం పలికారు. సీఎం జగన్‌పై, ఎమ్మెల్యే జగ్గిరెడ్డిపై ఆయా కుటుంబాల వారు అభిమానం వ్యక్తం చేస్తూ పథకాలతో సంతోషంగా ఉన్నామంటూ కృతజ్ఞతలు చాటుకున్నారు. ఆయా కుటుంబాల వారికి అందిన పథకాలను జగ్గిరెడ్డి వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే వారందరితో వచ్చే ఎన్నికల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ డీఎస్, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, సలాది మావాజీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతకు అండగా నిలవండి: ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఎంతో మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం అప్పనపల్లిలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే మళ్లీ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తీసుకురావాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొంతు సీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, అమ్మవారి దేవస్థానం చైర్మన్ తులా నాగరాజు, అప్పనపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, ట్రస్టీలు గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు గెద్దం వెంకటేశ్వరరావు, బత్తుల జనార్దన్, తులా గోపాలకృష్ణ, లంకే ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఏ1 సేవా సమితి సేవలు అభినందనీయం

రాజోలు: ఏ1 సేవా సమితి సేవలు అభినందనీయమని డిప్యూటీ మాజీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏ1 సేవా సమితి సప్తమ వార్షికోత్సవం, నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ప్రారంభించారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యబృందం శిబిరానికి విచ్చేసిన వారికి వైద్య పరీక్షలు చేశారు. గుండె, ఎముకలు, కంటి, ఈఎన్‌టీ, జనరల్ మెడిసన్ వైద్య సేవలు అందించారు. ఏ1 సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కరోనా కష్టకాలంలో ఏ1 సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ ప్రజలకు ఎంతో అండగా నిలిచారన్నారు. అమలాపురం టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, తాటిపాక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, డాక్టర్ గేదెల వరలక్ష్మి, జగడం సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, మోకా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

25న రైతు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం

సఖినేటిపల్లి: డి ఫారం పట్టా భూముల, ఫార్మింగ్ సొసైటీ భూముల రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి రైతు రాయబారం పేరున ఒక వినతి పత్రం ఇవ్వనున్నట్టు రాష్ట్ర కౌలు రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు చెల్లుబోయిన కేశవశెట్టి అన్నారు. శనివారం అంతర్వేదికరలో ఆయన ఇంటి వద్ద జంపన ప్రసాదరావు అధ్యక్షతన కౌలు రైతుల సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కేశవశెట్టి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథం కలిగి, తద్వారా రైతుల సమస్యలు పరిష్కరించడం కోసమే ప్రభుత్వానికి రైతు రాయబారం కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వారు అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ సీహెచ్ తాతారావు, నెల్లి బుజ్జిబాబు, జి.కోటేశ్వరరావు, గేదెల తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరిలో సమగ్రనీటి యాజమాన్యంపై అవగాహన

అయినవిల్లి: వరిలో నీటిని నిలువ పరిమాణం, నీటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై హైదరాబాద్ కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ కంపెనీ ఆధ్వర్యాన విలస పంచాయతీ కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సదస్సు నిర్వాహకుడు జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరగ్గా ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సభలో నీటి సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్, అగ్రికల్చర్ ఏడీ నాగేశ్వరరావు, ఏవో వై.శోభ తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పనులు కల్పించాలి

అంబాజీపేట: ఉపాధి హామీ పథకంలో అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఇసుకపూడిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏఈఓ ఎ.వెంకట కృష్ణ అధ్యక్షతన శనివారం ఎంపీపీ పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డులను ఉపాధి కూలీలకు అందించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో కూలీలు తగు జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేసుకోవాలన్నారు. పనులు జరిగే ప్రాంతంలో మంచినీరు, ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ కేఎస్ గంగాధర్, మేట్లు పాల్గొన్నారు.

విద్యాసామర్థ్యాలు పెంచే విధంగా కృషి చేయాలి

సఖినేటిపల్లి: విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు తగిన కృషి చేయాలని ఎంఈవో నల్లి మనోహరం అన్నారు. శనివారం పల్లిపాలెం పాఠశాలలో సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంపును టీఏ-ఆర్ఎల్ జిల్లా కో ఆర్డినేటర్ సురేష్, జిల్లా శ్రీను ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును ఎంఈవో సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల్లో తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్ట్‌లలో వెనుకబడిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం టీఏ-ఆర్ఎల్ అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఎంఈవో అన్నారు. దీనికి సంబంధించిన ట్రైనింగ్‌ను ఉపాధ్యాయులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రస్తుతం వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన బోధన అందించేందుగాను సరదగా సమ్మర్ క్యాంపు అనే పుస్తకాన్ని కూడా వారికి ప్రభుత్వం ఇప్పటికే అందించిందన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారిపాలెంలో కొలువుదీరిన మహాలక్ష్మమ్మ, వనువులమ్మ వార్ల జాతర శనివారం రాత్రి వైభవంగా జరిగింది. గరగనృత్యాలు, బాణసంచా కాల్పులు, చిత్రవిచిత్ర వేషధారణలు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనుల పండవలా జరిపించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. అమ్మవారికి ఆదివారం భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, సోమవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాల వెలుగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడికి చెందిన గుంటూరి లక్ష్మీపతిరాజు (58) శుక్రవారం సాయంత్రం కాలువలోకి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారి పడి మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు.

పిడుగు పడి కొబ్బరిచెట్లు దగ్ధం



అంబాజీపేట: మాచవరంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై, భారీ ఉరుములతో పిడుగుపడి నాలుగు కొబ్బరి చెట్లు కాలిపోయాయి. చప్పిడివారిపాలెంలో గుబ్బల వెంకటేశ్వరరావుకు చెందిన నాలుగు కొబ్బరి చెట్లపై పిడుగు పడి నిప్పంటుకున్నాయి. అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీఎం కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. నివాస ప్రాంతాలకు కూత వేటు దూరంలో కొబ్బరి చెట్లపై పిడుగు పడటంతో ఆ నిప్పురవ్వలు ఎగసిపడి ఇళ్లపై పడతాయోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

మోరి చేనేత క్లస్టర్‌కు నిధులు

సఖినేటిపల్లి: జాతీయ చేనేత అభివృద్ధి పథకంలో భాగంగా న్యూఢిల్లీకి చెందిన డెవలప్‌మెంట్ కమిషనర్ ద్వారా మోరి చేనేత క్లస్టర్‌కు టెక్నో లాజికల్ అప్ గ్రేడేషన్ కింద రెండో విడతగా నిధులు విడుదల చేసినట్టు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి(డీహెచ్‌టీఓ) ఎం.రాజు అన్నారు. ఈ రెండో విడత నిధులతో మోరి సొసైటీ పరిధిలో 129 మంది చేనేత కార్మికులకు సమకూర్చే పరికరాల మొత్తం రూ.8,82,700 వ్యయంలో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.7,94,430, లబ్ధిదారుల వాటా రూ.88,270 ఉందన్నారు. సొసైటీ చైర్‌పర్సన్ జాన శంకరరావు, మేనేజర్ అంకం రామలింగేశ్వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.